క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1, 2, 5, 7, 10, 16, 17, 18, 19, 20వ వార్డుల్లో 16 పోస్టులు ఖాళీ ఉండగా 38 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇంటర్వ్యూలకు 28 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కిశోర్, సీనియర్ అకౌంటెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో మాజీ డైరెక్టర్‌కు పరామర్శ



కొత్త శ్రీనివాసులును పరామర్శిస్తున్న చేనేత నాయకులు

ఉరవకొండ: పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత బ్లాక్‌లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులను మంగళవారం కుర్ని సంఘం రాష్ట్ర నాయకుడు నేసే కోదండరామ్‌తో పాటు మండల చేనేత నాయకులు పరామర్శించారు. ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొంది, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ చేనేత కులాల అభ్యున్నతి కోసం కొత్త శ్రీనివాస్ ఎంతో పాటుపడ్డారన్నారు. పరామర్శించిన వారిలో కాసుల ఆంజనేయప్రసాద్, బీరే శివ, ఎర్రిస్వామి,రెడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్ సూచించారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచారు. విద్యార్థులు సేవాభావం పెంచుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయలక్ష్మి, బాపూజీ, ఓబిలేశు, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న జమీలాబీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆత్మకూరు వీధికి చెందిన జమీలాబీ రోడ్డు దాటుతుండగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వస్తూ వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో ఆమె కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బకాయిలపై మున్సిపల్ అధికారుల కొరడా



మున్సిపల్ కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్‌లో రూములకు తాళం వేస్తున్న ఆర్ఐ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్ కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలు ఉన్న రూములపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా 8 షాపు గదులకు తాళాలు వేశారు. ఆ గదుల నుంచి దాదాపు రూ.3 లక్షలకు పైగా అద్దె బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. పలు మార్లు నోటీసులు అందజేసినా యజమానులు స్పందించకపోవడంతో దుకాణాలకు తాళం వేశామన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం పెద్దపీట



కూడేరు: గొటుకూరులో రోగులకు కేస్ షీట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



కంబదూరు: వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న రాష్ట్ర డైరెక్టర్, ఎంపీపీ, సచివాలయ కన్వీనర్, అధికారులు



ఉరవకొండ: జగనన్న సురక్ష క్యాంపులో కేస్ షీట్లను అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

కూడేరు/బెళుగుప్ప: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రజల ముంగిటకే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం కూడేరు మండలంలోని గొటుకూరులో సర్పంచ్ ఆశాలత అధ్యక్షతన నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రోగులను అవసరమైతే జిల్లా వైద్యుల వద్దకు పంపి మెరుగైన వైద్య సేవలందిస్తామన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణచౌదరి, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, వైద్యులు సరిత, లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నేతలు తుప్పటి హరీష్, మదన్ మోహన్ రెడ్డి, హనుమంత రెడ్డి, సూరి, దామోదర్ రెడ్డి, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, నాగేశ్వర రెడ్డి, సర్దార్ వలి, వైద్య, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి గ్రామంలో సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ పెద్దన్న, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలసి మాజీ ఎమ్మెల్యే విశ్వ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు అయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ ఓబుళేసు, వైద్యాధికారులు ప్రియాంక, రుషికేష్, చంద్రశేఖర్‌నాయక్, హరిత, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల ఉపాధ్యక్షులు కరుణాకర్, దేవనాథ్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, అశోక్, గోపాల్, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి, రాధాకృష్ణారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

ఉరవకొండ/కంబదూరు/బ్రహ్మసముద్రం/కణేకల్లు/రాయదుర్గం రూరల్/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట/విడపనకల్లు: జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతోందని ఎంపీపీ చందాచంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ,, సర్పంచ్ లలితమ్మలు తెలిపారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జగనన్న సురక్ష వైద్యశిబిరం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, మండల సమన్వయకర్త ఓబన్న, ఎంఎల్‌ఓ ముండాసు ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే కంబదూరు మండలంలోని అండేపల్లి సచివాలయం-3లో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, ఎంపీపీ తిమ్మరాజమ్మ, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ సుధాకర్ రాజు ప్రారంభించారు. సీడీపీఓ వనజ అక్కమ్మ, వైద్యాధికారులు అసియా, ప్రసన్నకుమార్, ప్రవీణ్‌కుమార్, ఆర్‌బి కిరణ్ కుమార్, నాయకులు శ్రీరామరెడ్డి, తలారి రమేష్, గంగాధర్, కట్టా శీన, మంద నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని పాలవెంకటాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీడీఓ దాసానాయక్ , తహసీల్దార్ బాలకిషన్ , డాక్టర్ రాజేష్ కుమార్, ఎంఈఓ ఓబుళపతి, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, నరసింహులు , నాగభూషణ, అయ్యన్న లక్ష్మీప్రసాద్ , శివన్న , ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కణేకల్లు మండలంలోని బెణికల్లులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సర్పంచు జేజేటీ మౌనిక అధ్యక్షతన నిర్వహిచారు. తహశీల్దార్ రజాక్‌వలి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైద్యులు రమేష్‌నాయక్, చంద్రమనోహర్, విజయకుమార్‌నాయక్, ఈఓఆర్డీ గూడెన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మాజీ సర్పంచు జేజేటీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునగౌడ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలంలోని జుంజురాంపల్లిలో ఎంపీడీఓ కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ విద్యావతి ప్రారంభించారు. అవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ , తహసీల్దార్ మారుతి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, ఎంపీటీసీ సురేష్, రేకుల కుంటల సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, మాజీ ఎంపీపీ కుమారస్వామి, సచివాలయాల కన్వీనర్లు నాగరాజు, మంజునాథస్వామి, హనుమంతరాయుడు, కొల్లప్ప, మఠం మహేష్ , వైద్యులు మాధవ్ మోహన్ కుమార్, ఓంకార్ , ఎంఈఓ వెంకటరమేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్‌లు రాధిక, తిప్పేస్వామి, ఎంపీటీసీ హనుమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీహెచ్ రాజ్ కుమార్, ఈఓపీఆర్డీ విజయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, వైద్యులు రమేష్, బాలాజీనాయక్, ఉమామహేష్, మహేంద్ర, మోహన్‌సాయి ,రాంకిషోర్, సర్పంచ్ జయమ్మ, డిప్యూటీ తహసీల్దార్ రఘు, సీహెచ్‌ఓ మురళీధర్ పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండలంలోని డోనేకల్లులో జగనన్న ఆరోగ్యం సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచ్ ఎర్రెమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, నాయకులు భీంరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కణేకల్లు: బెణికల్లులో బాధితులకు టాబ్లెట్ కిట్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు



రాయదుర్గం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ విద్యావతి



బొమ్మనహాళ్: కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

నేడు మండల సమావేశం

రాయదుర్గం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య మంగళవారం తెలిపారు. ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు , కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

వజ్రకరూరు: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జగనన్నకు వందనం పోస్టర్‌ను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజంచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు అందేలా చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంజీవరాయుడు, స్టేట్ జాయింట్ సెక్రటరీ హనుమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, సభ్యులు అనిల్, రామచంద్ర, నారునాయక్, రాజ్యలక్ష్మి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

'వేతనాలు బ్యాంకుల ద్వారా చెల్లించాలి'

ఉరవకొండ: ఉరవకొండ సీపీడబ్ల్యూఎస్ఎస్ పథకం కింద 22 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు పెంచిన జీతాలను బ్యాంకుల ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవడంతోపాటు, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ నస్రీన్‌కు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మల్లి, శ్రీనివాసులు, ఉమాపతి, లక్ష్మీనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

'శ్మశానానికి స్థలం కేటాయించండి'

కూడేరు: కరుట్లపల్లిలో శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని వైఎస్సార్ సీపీ నేతలు శౌరిరెడ్డి, హంపయ్య, అక్కులన్న, శంకరయ్య, పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శేషారెడ్డిని కలసి విన్నవించుకున్నారు. స్థలం లేక అరకొర స్థలంలోనే మృతదేహాల మీద మృతదేహాలు పూడ్చాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి శ్మశానానికి స్థలం కేటాయిస్తామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు.

'హంతకులను శిక్షించాలి'

రాయదుర్గంటౌన్: చిత్తూరు జిల్లా పెనమలూరు మండలంలో ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాయదుర్గంలో మంగళవారం విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీఐటీయూ, బీఎస్పీ, వడ్డెర్ల సంఘం, కళాశాల విద్యార్థినులు పట్టణంలోని వినాయక సర్కిల్ మానవహారంగా ఏర్పడి ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులను తక్షణం అరెస్ట్ చేసి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగిశివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీపీఐ కార్యదర్శి నాగార్జున, ఎమ్మార్పీఎస్ హరిగోపాల్, బీఎస్పీ ఉలిగప్ప, వడ్డే సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జావీద్(సాక్షి టీవీ), ఉపాధ్యక్షుడిగా హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా ఇషాక్, కోశాధికారిగా అనిల్ , సహాయ కార్యదర్శిగా రూపేష్, గౌరవ సలహాదారులుగా లింగ ప్రసాద్, రవి, మస్తాన్, వలి, గోవిందు ఎన్నికయ్యారు.

చంద్రబాబు అరెస్టుతో 'తమ్ముళ్ల' నిస్తేజం

- సానుభూతి కోసం టీడీపీ నేతల పాకులాట
- పట్టించుకోని ప్రజానీకం

రాయదుర్గం: రాష్ట్రంలో టీడీపీ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయి జైలుపాలవ్వడంతో ఆ పార్టీ నేతలు నిస్తేజంలో పడ్డారు. బాబు అరెస్టును అడ్డుపెట్టుకుని సానుభూతి పొందాలని చేస్తున్న విశ్వ ప్రయత్నాలు ప్రజల్లో బెడిసికొట్టాయి. ప్రజలంతా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తారని నమ్ముకున్న నేతలు అభాసుపాలయ్యారు. ప్రజాసొమ్ము దోపిడీ చేసి కుంభకోణంలో ఇరుక్కున్న చంద్రబాబు జైలుకెళ్లితే తామెందుకు మద్దతిస్తామంటూ ప్రజలు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. దీంతో టీడీపీ నాయకులు ఉనికోసం చేపట్టే ఆందోళనలు, నిరసనలు, దీక్ష శిబిరాలు జనం లేక వెలవెలబోతున్నాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు నాయకత్వం వహిస్తున్న రాయదుర్గంలోనూ ప్రజా మద్దతు అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. ఈ కారణంగా ఆయన కుల రాజకీయాలకు తెరలేపాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనూ ఈ పరిస్థితులే ఎదురవుతుండడంతో టీడీపీ నాయకత్వం లోలోపల కుమిలిపోతున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ దీక్షలు ఓ డ్రామా

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఇటీవల రాయదుర్గంలో చేపట్టిన నిరహార దీక్షపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కొందరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. తప్పు చేశాడు కాబట్టే జైలు కెళ్లాడని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీపీ, షుగర్ లాంటి వ్యాధులు ఉండే వారు నిరాహార దీక్షలు ఎలా చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. కాలవ దీక్షకు సంఘీభావం తెలిపేందుకు కొందర్ని బలవంతంగా పిలిపించుకున్నారని పలువురు బహిరంగంగా చర్చించుకోవడం కనిపించింది. దీక్ష విరమణపై టీడీపీ నాయకులే తెరచాటుగా పోలీసులపై ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా చంద్రబాబు అరెస్టు తర్వాత టీడీపీలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన, నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన కరువవడంతో పార్టీ యంత్రాంగం అంతర్మథనంలో కుంగిపోతోంది.



లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

కణేకల్లు: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చొరవతో కణేకల్లు పట్టణంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. పట్టణంలోని ఇందిరమ్మ, మత్స్య కార్మికుల కాలనీ, కొత్తకొట్టాల, రామనగర్ తదితర కాలనీలో ఓవర్ లోడ్, లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఓవర్‌లోడ్ కారణంగా తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యేవి. దీంతో తరచూ కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడేది. లో ఓల్టేజీతో బల్బులు క్యాండిల్ తరహాలో వెలిగేవి. 15 ఏళ్ల నుంచి ఈ సమస్య ఇలాగే ఉంది. ఈ క్రమంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లిన సమయంలో స్థానికులు కరెంటు సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన విద్యుత్ ఎస్ఈ సురేంద్ర, డీఈఈ శేషాద్రినాయుడుతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయించి ఆ పనిని పూర్తి చేయించారు. వారం క్రితం అధికారులు ఇందిరమ్మ కాలనీ, మత్స్య కార్మికుల కాలనీ, కొత్తకొట్టాల, రామనగర్, అతావుల్లా స్కూల్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ప్రారంభించగా... మంగళవారం ఈ పనులు పూర్తయ్యాయి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా నాణ్యమైన కరెంటు సరఫరా అవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



కణేకల్లులోని రామనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కర్ణాటక మద్యం పట్టివేత.. ఇద్దరి అరెస్టు

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లి-కన్నేపల్లి మధ్య ఓ పొలంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. సెబ్ అధికారులు వివరాల మేరకు.. మండలంలోని గుడిపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు పొలంలోని ఓ రేకుల షెడ్డులో కర్ణాటక మద్యం నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కళ్యాణదుర్గం సెబ్ అధికారి క్రిష్ణానాయక్ సిబ్బంది, స్పెషల్ టీమ్ సిబ్బంది దాడి చేసి 29 బాక్సుల (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ రామక్రిష్ణ సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ మద్యాన్ని పరిశీలించారు. నిందితులు పాలన్న, దేవేంద్రప్పపై కేసు నమోదు చేసి ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్టుబడిన మద్యం చూపుతున్న సెబ్ అధికారులు

గ్యాస్ సిలిండర్ పేలి దంపతులకు గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని గరుడాపురం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... గరుడాపురం గ్రామానికి చెందిన వెంకటేశులు, మాదేవి దంపతుల కుమార్తె అంజలికి శెట్టూరుకు చెందిన బొమ్మయ్యతో వివాహమైంది. ఈ క్రమంలో గ్రామంలో మారెమ్మ పండుగ ఉండడంతో మంగళవారం సాయంత్రం భర్తతో కలసి పుట్టింటికి అంజలి చేరుకుంది. కుటుంబసభ్యులందరూ ఆరుబయట కూర్చొని పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుండగా ఇంట్లో అంజలి, బొమ్మయ్య వంట పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీలో చేర్పించి, చికిత్స అందజేయిస్తున్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



బెళుగుప్ప: మారెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని అంకంపల్లిలో గ్రామ దేవత మారెమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు వేర్వేరుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శంకర్ వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, గోపాల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్‌లో మంగళవారం మారెమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. వేదావతి హగరి నది నుంచి గంగను తెచ్చి అమ్మవారికి అభిషేకం చేసి కుంభాలతో నైవేద్యం సమర్పించారు. ఏటా బాద్రపద మాసంలో అమ్మవారి జాతరను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉరుములు, డ్రమ్ములతో ఊరేగింపు నిర్వహించారు.



కుంభాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

దాడి కేసులో టీడీపీ నాయకుల అరెస్ట్

కళ్యాణదుర్గం: స్థానిక వాల్మీకి సర్కిల్‌లో గత నెల 19న చిరు వ్యాపారి రాజ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన కేసులో టీడీపీ నాయకులను మంగళవారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. కూరగాయల దుకాణానికి బైకులు అడ్డుగా పెట్టడంతో వాటిని పక్కకు తీయాలని చెప్పిన రాజ్‌కుమార్‌పై టీడీపీ నాయకులు యర్రంపల్లి సత్తి, శ్రీనివాసరెడ్డి, షామీర్ దాడికి తెగబడిన విషయం తెలిసిందే. దీంతో అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులను సీఐ తేజమూర్తి మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

రాయదుర్గం: డి.హీరేహాళ్ మండల కేంద్రం సచివాలయం-2 వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి మంగళవారం తెలిపారు. అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శ్మశాన అభివృద్ధికి నిధుల మంజూరు

బెళుగుప్ప: మండలంలోని గంగవరం శ్మశానవాటిక అభివృద్ధి పనులకు ఎంపీ తలారి రంగయ్య రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. మంగళవారం గ్రామంలోని ప్రజాప్రతినిధులకు మంజూరు పత్రాన్ని ఎంపీ అందించారు. ఈ సందర్భంగా ఎంపీని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్, సచివాలయ కన్వీనర్ రాము, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు రామాంజినేయులు, చెన్నవీర తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

కూడేరు: మండలంలోని అంతరగంగ గ్రామంలో మంగళవారం సాయంత్రం బాబయ్య అనే రైతు తన పొలంలో పని చేస్తుండగా పాము కాటేసింది. రైతు అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు 108లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.